క్లుప్తంగా

భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు



చార్మినార్: కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ ఆదివారం సాయంత్రం చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ శశికళ, సూర్య కుమార్ తదితరులు ఆలయ మర్యాదలతో ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించారు.

టిబెట్ సయోగ్ మంచ్ ఆధ్వర్యంలో నిరంతర సేవలు



నవనీత్ శివరతన్

అబిడ్స్: టిబెట్ సయోగ్ మంచ్ ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతామని అధ్యక్షుడు నవనీత్ శివరతన్ పేర్కొన్నారు. ఎస్ఎస్‌కే సమాజ్ కోశాధికారి నవనీత్ శివరతన్‌ను తెలంగాణ రాష్ట్ర టిబెట్ సయోగ్ మంచ్ అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, బడుగు వర్గాల కోసం తరచూ పెద్ద ఎత్తు సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. ఎస్ఎస్‌కే సమాజ్ అభివృద్ధికి మరింతా కృషి చేస్తానని ఆయన అన్నారు. తనపై నమ్మకంతో పదవిని అప్పగించిన జాతీయ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలు



గౌలిపురా: గౌలిపురాలోని బొడ్రాయి ఆలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పోతురాజుల నృత్యాలు.. డప్పు చప్పుళ్ల మధ్య బోనాలను సమర్పించారు. గౌలిపురా బొడ్రాయి ఆలయ ముఖద్వారం నిర్మాణం పూర్తయిన సందర్భంగా ఆదివారం ఉదయం బొడ్రాయి ఆలయం నుంచి గౌలిపురా మహంకాళి మాతేశ్వరి భరతమాత ఆలయం వరకు పోతరాజుల నృత్యాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి పట్టు వస్త్రాలు, ఒడి బియ్యాన్ని సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అమర్‌నాథ్ గౌడ్, చంద్రమోహన్, టి. భాస్కర్, జానకీరామ్, సిద్దేశ్వర్ చారి, రాందేవ్, శంకర్, రఘునాథ్ గౌడ్, రాజయ్య, పవన్, శ్యామ్ పాల్గొన్నారు.

శివాజీని యువత ఆదర్శంగా తీసుకోవాలి



శివాజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

గోల్కొండ: హిందువులను ఐక్యం చేస్తూ మొఘలులను ధైర్యంగా ఎదిరించిన ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను నేటి హిందు యువత ఆదర్శంగా తీసుకోవాలని ఛత్రపతి శివాజీ మహారాజ్ నవయువ మండల్ నాయకుడు నరేష్ జాదవ్ అన్నారు. ఆదివారం కార్వాన్ బాంజవాడిలోని మరాఠ బస్తీలో ఛత్రపతి ధర్మవీర్ శంబాజి మహారాజ్ సేన, ఛత్రపతి మరాఠ నవయువ మండల్ వారు ఛత్రపతి మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు శివాజీ మహారాజ్ బాటలోనే నడుస్తారని ప్రతిజ్ఞ చేశారు. ఆయన మాట్లాడుతూ.. శివాజీ విగ్రహానికి 100వ ఆదివారం పూజలు నేటితో పూర్తయ్యాయన్నారు. నితిన్ ఖరాడే, శశికాంత్ బాబ్డే, వికాస్ టాండాకర్, నితిష్ నాలావాడే, ప్రశాంత్ జాదవ్ తదితరులున్నారు.

'ఖాదర్‌బాగ్' అభివృద్ధికి కృషి

గోల్కొండ: ఖాదర్‌బాగ్ అభివృద్ధికి కృషి చేస్తున్నానని మజ్లిస్ సీనియర్ నాయకుడు షబ్బీర్‌ఖాన్ అన్నారు. ఖాదర్‌బాగ్‌తో పాటు ఇంద్రానగర్ అభివృద్ధి కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ ఎన్నో నిధులు కేటాయించారని ఆయన అన్నారు. సీసీ రోడ్లతో పాటు కొత్త డ్రైనేజీ పనులు చేయించామన్నారు.

కోటలో పర్యాటకుల సందడి

గోల్కొండ: గోల్కొండ కోట పర్యాటకులతో సందడిగా మారింది. ఆదివారం ఉదయం నుంచే భారీ సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి కోటకు తరలివచ్చారు. కోటలోని నేటికి చెక్కు చెదరకుండా ఉన్న రాణీమహాల్ తదితర ప్రదేశాలను ఎంతో ఆసక్తిగా తిలకించారు. కుతుబ్‌షాహీ రాజుల పాలనను పర్యవేక్షించే మంత్రులు అక్కన్న-మాదన్న కార్యాలయాలన్ని పర్యాటకులు చూసి ఆశ్చర్యపోయారు. మరోవైపు సెవన్ టుంబ్స్‌గా పేరుపడ్డ కుతుబ్‌షాహీల సమాధుల వద్ద సైతం పెద్ద సంఖ్యలో పర్యాటకులు సందడి చేశారు.

కాలం మారుతున్నా..

కులవృత్తికి ప్రాధాన్యం



చాంద్రాయణగుట్టలో కుండలను తయారు చేస్తున్న దృశ్యం



అమ్మకానికి ఉంచిన కుండలు

- పాతబస్తీలో కుండలకు భలే గిరాకీ
- ఏ సీజనైనా తగ్గని ఆదరణ
- వేసవిలో కుమ్మరులకు చేతినిండ పని..

చాంద్రాయణగుట్ట: వేసవి కాలంలో భానుడి ప్రతాపం నుంచి ఉపశమనం పొందేందుకు చాలా మంది ఫ్రిజ్ వాటర్.. శీతల పానీయాల వైపు మొగ్గు చూపుతుంటారు. ఇలాంటివి తాగడం ద్వారా ఆ క్షణం వరకు దప్పిక తీరినట్టే తీరినా.. వెంటనే మరింత దాహం వేయడం చూస్తుంటాం. కానీ చల్లటి మట్టి కుండలోని నీరు తాగితే ఆ ఊరట వేరేలా ఉంటుంది. ఎంత ఎండలో వెళ్లి వచ్చినా కుండలోని గ్లాస్ నీరు తాగితే వచ్చే ఆ భావన ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. ప్రస్తుతం ఎండలు మండుతుండడంతో పాతబస్తీలోని పేద ప్రజలంతా కుండలను కొనుగోలు చేస్తున్నారు. ఉగాది కూడా వస్తుండడంతో కొత్త కుండలకు ప్రాధాన్యం ఏర్పడింది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో నగర జనం దినదినాభివృద్ధి చెందుతున్నప్పటికీ.. పాత నగరంలో కొందరు శాలివాహన (కుమ్మరి) కులస్తులు ఇప్పటికీ మట్టి కుండలను తయారు చేస్తూ చేతి వృత్తులను బతికిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

పాతబస్తీలో పలు కుమ్మరివాడీలు..

- పాతబస్తీలోని పలు బస్తీల్లో కుమ్మరి కులస్తులు అధిక సంఖ్యలో నివాసం ఉండేవారు. ఈ క్రమంలోనే పాత నగరంలోని పలు కాలనీలకు కుమ్మర్‌వాడీలుగా పిలవబడ్డాయి.
- ఆయా ప్రాంతాల్లో ఏకంగా 40-50 కుటుంబాల వరకు కుండలను తయారు చేస్తున్న క్రమంలో కుమ్మరి వాడీలుగా ప్రసిద్ధి చెందాయి. ఇలా చాంద్రాయణగుట్ట కుమ్మర్‌వాడీ, లాల్‌దర్వాజా కుమ్మర్‌వాడీ, గౌలిపురా కుమ్మర్‌వాడీ, అలియాబాద్ కుమ్మర్‌వాడీ, ఈదిబజార్ కుమ్మర్‌వాడీలుగా ప్రసిద్ధి చెందాయి.
- ఇందులో ప్రస్తుతం చాంద్రాయణగుట్ట, లాల్‌దర్వాజా, గౌలిపురాలలో మాత్రమే ఇప్పటికే కుండలను తయారు చేస్తున్నారు. 50 ఏళ్లకు పైబడిన వారు మాత్రమే ఈ కుండలు తయారు చేస్తుండగా.. ప్రస్తుత యువతరం మాత్రం ఈ కులవృత్తికి దూరంగా ఉంటున్నారు.

సంప్రదాయాలను కాపాడుతున్న శాలివాహనులు..

- కుమ్మరీ కులస్తులు కుండలను తయారు చేస్తూ ఇప్పటికీ మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతున్నారు.
- వేసవి కాలంలో చేసే కుండలు కేవలం దాహార్తిని తీర్చేందుకు మాత్రమే వినియోగిస్తున్నప్పటికీ..మిగతా సీజన్‌లలో వీరు తయారు చేసే కుండలు సంస్కృతిని ప్రతిబింబిస్తుంటాయి.
- ఇలా వీరు బోనాల సీజన్‌లో బోనం కుండలు, ఉగాదికి పచ్చడి కుండలు, దీపావళికి దొంతులు, ఇక వివాహాది శుభాకార్యాల సమయంలో అవిరేను కుండలను తయారు చేస్తుంటారు. వీటితో పాటు వర్షాకాలంలో పూల తొట్లు తయారు చేయడం జరుగుతుందని వారు పేర్కొన్నారు.

ప్రభుత్వ సహకారం కావాలి..



నేను ఎన్నో ఏళ్ల నుంచి కుండలను తయారు చేస్తున్నా. మొదట్లో పాతబస్తీలో పెద్ద ఎత్తున చేసేవాళ్లం. కానీ ప్రస్తుతం ఏళ్లపై లెక్క పెట్టేంత స్థాయిలో మాత్రమే చేస్తున్నారు. కుల వృత్తులను ప్రోత్సహించేలా మాకు ప్రభుత్వం నుంచి ఎలాంటి రుణాలు కూడా ఇవ్వడం లేదు. పైగా కట్టె మిషన్లు బంద్ కావడంతో వాము కాల్చడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

– కృష్ణ, చాంద్రాయణగుట్ట కుమ్మర్‌వాడీ

మట్టి కుండ నీరే మధురం



వేసవి వచ్చిందంటే కొత్త కుండ తీసుకొస్తాం. ఎంత ఎండలు ఉన్నప్పటికీ కుండలోని గ్లాస్ నీరు తాగితే ఎంతో ఉపశమనంగా ఉంటుంది. ముఖ్యంగా ఆరోగ్య సమస్యలు తలెత్తే ఫ్రిజ్ నీటికి దూరంగా ఉంటాం. ఫ్రిజ్‌ల వినియోగం ద్వారా కూడా పర్యావరణానికి చేటు చేసినట్లవుతోంది. పాతబస్తీలో ఇప్పటికీ కుండలను తయారు చేస్తుండడంతో బోనాలు, ఉగాది, దీపావళి తదితర సమయాలలో ఇక్కడే కొనుగోలు చేసేందుకు మాకు మంచి అవకాశం ఉంటుంది.

– కళమ్మ, ఉప్పుగూడ

దళితులకు అండగా కేసీఆర్ ప్రభుత్వం



దళితవాడ బస యాత్రలో పాల్గొన్న టెక్నాలజీ చైర్మన్ జగన్మోహన్‌రావు, గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: దళితులకు అండగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ జగన్మోహన్‌రావు పేర్కొన్నారు. గోషామహల్ పరిధిలోని చుడిబజార్, అంబేడ్కర్‌నగర్, దేవీనగర్ బస్తీల్లో గడ్డం గంగాధర్ ఫౌండేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన దళితవాడలో బస యాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దళితుల కోసం సీఎం కేసీఆర్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దళితులకు అండగా నిలిచిందన్నారు. అనంతరం గడ్డం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్ని వర్గాల ప్రజలకు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు సైతం తాము అండగా ఉండి వారికి అన్నివిధాలుగా సహకారాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తిర్మలేష్, గణేష్, రాజేష్, సూరి, దానం శేఖర్, రాములు, గోపి, ఎల్లయ్య, శ్రీను, మహిళా నాయకురాళ్లు భారతి, సంతోషి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

మేయర్ రాజీనామా చేయాలి

గన్‌ఫౌండ్రీ: అంబర్‌పేటలో నాలుగేళ్ల బాలుడిని వీధి కుక్కలు కరిచి చంపిన ఘటనపై మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మేయర్ గద్వాల విజయలక్ష్మి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని యువజన కాంగ్రెస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మోతే రోహిత్ అన్నారు. మేయర్ వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం నగరంలోని పలుచోట్ల నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికంగా ఉన్న వీధి కుక్కలను పట్టుకుని వినూత్న పద్ధతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్ల బాలుడిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మేయర్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వీధి కుక్కల నియంత్రణను తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నగర నాయకులు పాల్గొన్నారు.



బషీర్‌బాగ్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న రోహిత్

సత్ఫలితాలిస్తున్న 'హరితహారం'



గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో ఆకట్టుకుంటున్న మొక్కలు, చెట్లు

గోల్కొండ: ప్రతి ఏటా నిర్వహిస్తున్న హరితహార కార్యక్రమం మంచి ఫలితాలు ఇస్తోంది. హరితహారంలో నాటిన మొక్కలను పరిరక్షించడంతో అవి నేడు చూపరులను ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో లేబర్ వార్డు ముందున్న పూతోట ఎంతో ఆకర్షణీయంగా కానవస్తుంది. గతంలో తాము నిర్వహించిన హరితహారంలో మొక్కలను నాటామని, వాటిని ప్రతి నిత్యం నీరుపోసి పెంచడం వల్లే అవి ఏపుగా పెరిగాయని గోల్కొండ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా అన్నారు. ఆస్పత్రిలో మొక్కల పరిరక్షణ కోసం ఖాదర్ బిన్ ఈతను నియమించడం జరిగిందని ఆయన తెలిపారు.

పర్యావరణంపై చిత్రలేఖనం పోటీలు



చిన్నారులను అభినందిస్తున్న డాక్టర్ కేవీ.రమణాచారి

నాంపల్లి: కళలు సంస్కారాన్ని, సమర్థతను పెంచుతాయని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ.రమణాచారి అన్నారు. ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆదివారం నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని జవహర్ బాలభవన్‌లో బాలలకు పర్యావరణంపై చిత్రలేఖనం పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేవీ.రమణాచారి హాజరై మాట్లాడారు. నేడు పర్యావరణం తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. బాల్యం నుంచే పర్యావరణం పట్ల అవగాహన పెంచుకోవడమే పరిష్కార మార్గమని సూచించారు. చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు జూన్ 5న పర్యావరణ దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేస్తామని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు రంగయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కన్జర్వేటర్ ఫారెస్ట్ అధికారి కొండా మోహన్, సీనియర్ పాత్రికేయులు బీవీ.ప్రసాద్, సినీ డైరెక్టర్ వాసు, ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ గౌరవాధ్యక్షులు ఉప్పల వెంకటేష్‌గుప్తా పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటర్ ఐడీ కార్డులు పొందాలి



చార్మినార్: అర్హులైన ఓటర్లందరూ ఓటర్ ఐడీ కార్డులను పొందాలని గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశ్యమోని శ్యామ్‌రావు ముదిరాజ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటర్ ఐడీ కార్డులను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఈ ఆదివారం బార్కాస్‌లో దాదాపు 1500 మందికి ఓటర్ ఐడీ కార్డులను అందజేసినట్లు ఆయన తెలిపారు. చాంద్రాయణగుట్ట ఏ బ్లాక్ అధ్యక్షుడు షకీల్ దయానీతో పాటు నాయకులు అబ్దుల్లా, వాహేద్ తదితరులు పాల్గొన్నారు.

వీర సావర్కర్‌కు నివాళి

గోల్కొండ: వీర సావర్కర్ వర్ధంతిని గుడిమల్కాపూర్‌లో ఆదివారం నిర్వహించారు. గుడిమల్కాపూర్ స్వాతంత్ర్య వీర్ సావర్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సావర్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి ఏటా వీర్ సావర్కర్ వర్ధంతిని నిర్వహిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షులు జొన్నకుంటి మధుసూదన్ అన్నారు. బల్దియా సిబ్బందిని సన్మానించి వారితో సహపంక్తి భోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్వాన్ యాదవ సంఘం అధ్యక్షులు బోడి అశోక్ యాదవ్, అవినాష్, దేవేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



వైభవంగా సర్బోజననీ హరే కృష్ణ సంకీర్తన ర్యాలీ



ర్యాలీలో దీపాంకర్ పాల్ తదితరులు

చార్మినార్: హరే కృష్ణ సంకీర్తన ర్యాలీ పాతబస్తీలోని చార్మినార్ వీధుల్లో వైభవంగా జరిగింది. ఆదివారం సాయంత్రం కులీ కుతుబ్ షా స్టేడియం నుంచి బయలుదేరిన ఈ ర్యాలీ హైకోర్టు రోడ్డు, మదీనా సర్కిల్, పత్తర్‌గట్టి, చార్‌కమాన్, గుల్జార్‌హౌజ్, చార్మినార్, ఘాన్సీబజార్ ద్వారా తిరిగి కుడా స్టేడియానికి చేరుకుంది. అంతకుముందు హైదరాబాద్ సర్బోజననీ హరే కృష్ణ సంకీర్తన కమిటీ, హైదరాబాద్ బెంగాలీ అసోసియేషన్ సంయుక్తాధ్వర్యంలో శనివారం రాత్రి కుడా స్టేడియంలో ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం పాతబస్తీ చార్మినార్ వీధుల్లో సంకీర్తన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు దీపాంకర్ పాల్‌తో పాటు పలువురు బెంగాలీ యువతీ, యువకులతో పాటు శ్రీకృష్ణుని మహిళ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. దూద్‌బౌలి ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. కులీ కుతుబ్ షా స్టేడియం, ఘాన్సీబజార్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. గుల్జార్‌హౌస్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలో..

విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. అన్సర్ మిర్చి ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు. నీలం సెంటర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఆస్మాన్‌ఘడ్ సీబీడీ ఏడీఈ పరిధిలో..

విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌ఘడ్ సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. అరుంధతి కాలనీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

కేంద్రమంత్రికి సత్కారం



కేంద్ర మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్‌ను సత్కరిస్తున్న గోపాల్‌జీ తదితరులు

అబిడ్స్: కేంద్రమంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్‌ను అబిడ్స్‌లోని కట్టెలమండి పార్టీ కార్యాలయంలో రాష్ట్ర బీజేపీ కార్యాలయ కో ఆర్డినేటర్ గోపాల్‌జీ, నందు, మోహన్ ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గోపాల్‌జీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

సింహవాహిణి ఆలయం కేలండర్ ఆవిష్కరణ

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిణి మహంకాళి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 వార్షిక కేలండర్‌ను ఆదివారం సరస్వతీ ఉపాసకులు దైవాజ్ఞ శర్మ సమక్షంలో కేంద్ర మాజీ మంత్రి, ఐడీసీ చైర్మన్ డాక్టర్ వేణుగోపాల చారి ఆవిష్కరించారు. లాల్‌దర్వాజా సింహవాహిణి మహంకాళి ఆలయ ఫోర్‌మెన్ కమిటీ అమ్మవారి నవదుర్గ రూపాలతో రూపొందించిన కేలండర్‌ను వేణుగోపాల చారి పంపిణీ చేశారు. ఫోర్‌మెన్ కమిటీ చైర్మన్లు పోసాని సురేందర్ ముదిరాజ్, బద్రీనాథ్ గౌడ్, మాజీ చైర్మన్లు కాశీనాథ్ గౌడ్, విష్ణు గౌడ్, విజయ్ కుమార్, సి.వెంకటేశ్, పోసాని సదానంద్, సుధాకర్ ముదిరాజ్, రంగ శ్రీకాంత్ గౌడ్, ప్రభు పాల్గొన్నారు.

పరామర్శ



అఫ్జల్‌గంజ్: భాగ్యనగర గణేష్ ఉత్సవ సమితి వ్యవస్థాపక సభ్యుడు పుత్రాజ్ జోషి అకాల మృతి బాధాకరమని హర్యానా గవర్నర్ బండ్డారు దత్తాత్రేయ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జోషి భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి వ్యవస్థాపనలో ఆలె నరేంద్రతో కలిసి తీవ్రంగా కృషి చేశారన్నారు. ఆయన అకాల మృతి తనను కలచి వేసిందని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు

నేడు జాబ్ మేళా

విజయనగర్‌కాలనీ: రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో నేడు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి జయశ్రీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏయిర్ ఇండియా సార్స్ ఏయిర్‌పోర్టు సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, మిత్ర ఏజెన్సీ తదితర సంస్థల్లోని 290 డ్రైవర్లు, హెల్పర్స్ (పురుషులు), సేల్స్ ఎగ్జిక్యూటీవ్ తదితర ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియేట్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండి 18 నుంచి 30 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి ప్రారంభ నెలసరి వేతనం రూ.14 వేల నుంచి అర్హత నైపుణ్యాన్ని అనుసరించి రూ.18 వేలతో పాటు ఇతర ఇన్‌సెంటీవ్స్ ఉంటాయన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం ఉదయం 10.30 గంటలకు ఫొటోలు, సర్టిఫికెట్లతో విజయనగర్‌కాలనీలోని రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో హాజరుకావాలన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా కృషి



నియామకపత్రాన్ని అందుకుంటున్న మనోహర్ ప్రసాద్ థాకరే

జియాగూడ: కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందే విధంగా కృషి చేస్తానని బీజేపీ కేంద్ర ప్రభుత్వ పథకాల కన్వీనర్ మనోహర్ థాకరే అన్నారు. ఈ మేరకు ఆదివారం గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పాండుయాదవ్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మనోహర్ ప్రసాద్ థాకరే మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలపై అవగాహన లేనందునా ప్రజలు ఎంతో నష్టపోతున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవగాహన కలిగే విధంగా ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాలకు సంబంధించిన అధికారులను నియమించి ప్రజలకు అవగాహన కల్పించి ప్రోత్సాహించాలన్నారు. ముఖ్యంగా ముద్ర, ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్, ఎంఎస్ఎంఈ తదితర సంక్షేమ పథకాలు ప్రజలకు అందేవిధంగా పాటు పడుతానన్నారు.

పెన్షన్‌దారులకు ప్రభుత్వం అండ: ఎమ్మెల్యే ముఠా గోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

సుల్తాన్‌బజార్: పెన్షన్‌దారులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం ఉస్మానియా మెడికల్ కళాశాల అల్యూమిని భవన్ ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర మెడికల్ అండ్ డెంటల్ టీచర్స్ (యూజీసీ) పింఛనుదారుల సంఘం ప్రెసిడెంట్ డాక్టర్ వీరేశం ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటీవ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వం పెన్షన్‌దారులకు అండగా ఉంటుందన్నారు. అనంతరం అధ్యక్షుడు డాక్టర్ వీరేశం మాట్లాడుతూ.. పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందించేందుకు ఐదు కమిటీలుగా ఏర్పడి నెలలో ఒకసారి ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహించి మందులను అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌చార్య, కోశాధికారి డాక్టర్ పి.బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ సుధాకర్‌రెడ్డి, డాక్టర్ డి.సుబ్రమణ్యం, ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ డాక్టర్ మసూద్, డాక్టర్ డి.ఆర్.డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ శ్యామ్‌సుందర్, డాక్టర్ రాజశ్రీ, డాక్టర్ అశోక్‌రెడ్డి, డాక్టర్ సురేష్ చందర్, డాక్టర్ బి.రాఘవేంద్రరావు, వైద్యులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక సౌజన్యంతో తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత మండల గురునాథం రచించిన ధరణివాస శతకం పుస్తకావిష్కరణ సభ ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఓయూ విశ్రాంత ఆచార్యులు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలోని పలు అంశాలను అందరికీ అర్థమయ్యేలా సరళమైన భాషలో రచించడం ఎంతో అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని రచనలను చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, భాషా నిపుణులు డాక్టర్ డి.చంద్రశేఖర్ రెడ్డి, తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షులు బడే సాబ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రముఖ రచయిత్రి ఎల్లికంటి జ్ఞాన ప్రసన్న వర్మ రచించిన సాయినాథ శతకం పుస్తకాన్ని ఆవిష్కరించారు.

దేశవ్యాప్తంగా బీఆర్ఎస్‌కు ఆదరణ



సమస్యలు తెలుసుకుంటున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: సీఎం కేసీఆర్ ప్రభుత్వ పథకాలు, ప్రగతి, అభివృద్ధితో తెలంగాణ తరహాలోనే దేశవ్యాప్తంగా బీఆర్ఎస్‌కు ఆదరణ లభిస్తుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. జాంబాగ్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో గోషామహల్‌తో పాటు రాష్ట్ర నలుమూలలా బీఆర్ఎస్ విజయం సాధిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు సీఎం కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆదర్శంగా తీసుకోవడం అభినందనీయమన్నారు.

ఉచిత వైద్య శిబిరం



గోల్కొండ: పేదలు నివసించే ప్రాంతాల్లో వైద్య శిబిరాలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం వల్ల ఎన్నో పేద కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని బీజేవైఎం నాయకుడు దేవర వంశి అన్నారు. ఆదివారం డాక్టర్స్ పోలిక్లినిక్ సెంటర్ వారు భోజగుట్ట శ్రీరాంనగర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రులు, డయాగ్నో సెంటర్ల వారు తమ సేవా కార్యక్రమాలను హితోధికం చేయాలని ఆయన కోరారు. డాక్టర్స్ పోలి క్లినిక్ వైద్యులు డాక్టర్ మజర్, అశ్విన్ మోదీ, నామ యాదగిరి, ప్రభు పూజారి, సుధాకర్ యాదవ్ తదితరులున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9553955684